ఘనంగా పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం


వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు


ఆలయంలో అన్నదానం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ రామకృష్ణ వీధిలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ 21వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రామకృష్ణ వీధి అధ్యక్షుడు జనంపల్లి పురేందర్‌రెడ్డి, సునీత దంపతులు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గొట్టిముక్కల భాస్కర్‌రావు, చంద్రకాంత్, కమిటీ సభ్యులు కార్యదర్శి రాంచంద్రరావు, తాండవ కృష్ణ, జి.ప్రసాద్, ఎస్. శ్రీధర్‌రావు, సూర్యనారాయణ, చంగల్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, డా.వంశీకుమార్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇప్పించే బాధ్యత జేఏసీది

ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీటీఎన్జీవోస్ సభ్యులకు ఇళ్ల స్థలాలు ఇప్పించే బాధ్యత ఉద్యోగ జేఏసీదేనని టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు, ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్ అన్నారు. సొసైటీ సభ్యులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సొసైటీకి స్థలం కేటాయించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆయన తెలిపారు. భాగ్యనగర్ టీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముత్యాల సత్యనారాయణగౌడ్ అధ్యక్షతన బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణ మండపంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మారం జగదీష్ మాట్లాడుతూ సొసైటీని అప్రదిష్ట పాలు చేసేందుకు కొంత మంది చేస్తున్న ప్రయత్నాల వల్ల సొసైటీకి నష్టమే జరుగుతుందని, దీంతో సొసైటీలోని వేలాది మంది సభ్యులు అనేక ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ సమస్యను ఉద్యోగ జేఏసీ డిమాండ్లలో పెట్టామని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించామన్నారు. ఆర్థికపరమైన సమస్యలు కొద్దిగా అలస్యమైనా నాన్ ఫైనాన్స్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ సమస్య నాన్ ఫైనాన్స్ సమస్య పరిధిలో ఉన్నందున త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీజీఓ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, టీఎన్జీవో ప్రధానకార్యదర్శి ముజీబ్ హుస్సేన్, కస్తూరి వెంకటేశ్వర్, సొసైటీ కార్యదర్శి జి.మల్లారెడ్డి, జి.రాజేశ్వర్ రావు, ఎ.శ్రీనివాస్, ఎస్.ప్రభాకర్‌రెడ్డి, కేశియా నాయక్, పి.శ్రీధర్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్ రావు, రశీదాబేగం, ఎస్.సంధ్యారాణి, జె.అమరజ్యోతి, టి.విష్ణువర్ధన్‌రెడ్డి, పి.నర్సింహరాజు, కె.దామోదర్, జి.ఏకనాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్.. నయా పంథా..

వాట్సాప్.. వీడియో కాల్స్ ద్వారా బెదిరింపులు



- అనుమానిత కాల్స్, లింకులకు దూరంగా ఉండాలి
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- చందానగర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ పాలవెల్లి



చందానగర్: ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగిపోయాయి. సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా మోసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చందానగర్ సీఐ డి.పాలవెల్లి సూచించారు. అనుమానిత, అపరిచిత ఫోన్‌కాల్స్, లింక్‌లు ఓపెన్ చేయొద్దని తెలిపారు. ఇటీవల ముంబై నుంచి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి మీపై నేరారోపణలు ఉన్నాయని, మా పోలీసులు వచ్చి అరెస్ట్ చేస్తారని భయపెడుతూ.. దీనినుంచి బయట పడాలంటే ఏకాంతంగా మీ గదిలోకి వెళ్ళి మేము చెప్పినట్టు చేస్తే మిమ్మల్ని ఎవరు అరెస్ట్ చేయరంటూ లక్షలాది రూపాయలు కొల్లగొడుతున్నారు. అన్ని లావాదేవీలు ఫోన్‌ల ద్వారానే జరుగుతున్న క్రమంలో స్టాక్ మార్కెట్ అంటూ.. ఆన్‌లైన్ కొనుగోళ్లు... బ్యాంకు రివార్డు పాయింట్‌లు.. కొరియర్ పంపుతున్నాం.. ఓటీపీ చెప్పండి అంటూ ఇలా రకరకాలుగా ఫోన్‌లు వస్తుంటాయని వాటికి రెస్పాండ్ కావొద్దని చెప్పారు. ఒకవేళ పొరపాటున క్లిక్ చేశారా గుట్టుచప్పుడు కాకుండా అకౌంట్‌లో డబ్బులు మాయమైపోతాయని వివరించారు. దీనిపై బుధవారం సీఐ పాలవెల్లి 'సాక్షి'తో మాట్లాడారు. వివరాలు వారి మాట్లల్లోనే..


చందానగర్ పోలీస్‌స్టేషన్

ప్రశ్న: ప్రస్తుతం ఎలాంటి సైబర్ నేరాలు జరుగుతున్నాయి?

జ: నేడు ఆర్థిక లావాదేవీలన్నీ డిజిటల్ ద్వారానే జరుగుతున్నాయి. అదే స్థాయిలో సైబర్ కేటుగాళ్లు డిజిటల్ నేరాలకు పాల్పడుతున్నారు. వివిధ రకాలుగా మోసం చేస్తున్నారు. అనుమానితులు, అపరిచితుల నుంచి ఫోన్‌కాల్స్, ఓటీపీలు, లింకులు వస్తే వాటికి స్పందించకుండా ఉండాలి. అలాంటి నంబర్ అని అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

ప్రశ్న: సైబర్ మోసాలపై ఫిర్యాదు చేయాలంటే..?

జ: చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సైబర్ నేరానికి గురైన బాధితులు ఫిర్యాదు చేస్తే రూ.50వేల లోపు అయితే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తాం. ఆపై జరిగితే సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలోని సైబర్ వింగ్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.

ప్రశ్న: బ్యాంకుల లోగోలతో లింకులు వస్తే ఏమి చేయాలి ?

జ: ప్రస్తుతం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో పాటు మరి కొన్ని ప్రభుత్వ బ్యాంకుల లోగోల ద్వారా లింకులు కూడా పంపుతున్నారు. ఆ లింకులను క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మనకు తెలియకుండానే వెళ్ళిపోతున్నాయి. ఆ లింకులపై అనుమానం వస్తే వెంటనే సంబంధిత బ్యాంకులకు, పోలీసులకు సమాచారం ఇయ్యాలి.

ప్రశ్న: పీఎస్ పరిధిలో ఉన్న సీసీ కెమెరాలు.. నిర్వహణపై ?

జ: చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీలలో 984 కెమెరాలు, వివిధ ప్రాంతాలలో కాలనీలు, బస్తీలలో 8,840 కెమెరాలు ఉన్నాయి. వాటి నిర్వహణను ఎప్పటికప్పుడు సిబ్బందితో పర్యవేక్షిస్తున్నాం.

ప్రశ్న: శాంతి భద్రతల అమలుకు తీసుకుంటున్న చర్యలు ?

జ: పోలీస్‌స్టేషన్ పరిధిలో కాలనీలు, బస్తీలలో రెండు పెట్రోలింగ్ వాహనాలు, బ్లూకోట్స్ సిబ్బంది ద్వారా 24 గంటల పాటు నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నాం. గతంతో పోలిస్తే ఇప్పుడు చాలా వరకు నేరాలను నియంత్రిస్తున్నాం.

ప్రశ్న: ఫ్రెండ్లీ పోలీసింగ్ గురించి..

జ: ప్రజలతో కలిసిమెలిసి సాగుతున్నాం. పండగల సమయాలలో పీస్ మీటింగ్ ఏర్పాటు చేసి శాంతియుతంగా చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. అంతే కాకుండా వివిధ కాలనీలలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చందానగర్: మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

◆ సీబీఆర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సీబీఆర్ ఎస్టేట్స్, క్రోమా బిల్డింగ్ వెనుక వైపు, ఆంధ్రాబ్యాంక్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆల్విన్‌కాలనీ పరిధిలో..

ఆల్విన్‌కాలనీ: విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విజయనగర్ 11/33 కె.వి. జలకన్య ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. శివనగర్, తులసీనగర్, వాంబే కాలనీలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో 1,28,700 కుటుంబాలు ఉండగా, 150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్ ఉండేలా 858 మందిని నియమించారు. 86 మంది సూపర్‌వైజర్లనూ నియమించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి మాట్లాడుతూ సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్ళి ఫారంలో సూచించిన విధంగా వివరాలను నమోదు చేయాలన్నారు.

మెగా రక్తదాన శిబిరం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, ప్రతినిధులు

చందానగర్: చైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినాన్ని పురస్కరించుకుని చైతన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, దుర్గాబాయి దేశ్‌ముఖ్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో మెగా రక్తదానం శిబిరంను బుధవారం మియాపూర్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా తప్పనిసరిగా రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డీన్‌లు సురేందర్‌బాబు, శంకర్‌రావు, శ్రీనివాసరావు, ఏజీఎంలు రాంబాబు, హరి, మాధవ్, చంటి, సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, ప్రసాద్, సందీప్‌రెడ్డి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు


క్రీడాకారులకు బహుమతులను అందించిన భెల్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని భెల్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సురేందర్ అన్నారు. బుధవారం భెల్ జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు నవ్యశ్రీ, శైలేంద్రనాథ్, జోగేందర్, బాల, సాయి, సందీప్‌లు రాష్ట్ర క్రీడాపోటీలకు ఎంపికైన సందర్భంగా వారిని సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడాకారులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం


ప్రశాంత్‌హిల్స్‌లో ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావును కలిసిన జెడ్సీ ఉపేందర్‌రెడ్డి, డీసీ ముకుంద్‌రెడ్డి


రోలింగ్‌హిల్స్‌లోని ఎమ్మెల్సీ భానుప్రసాదరావు నివాసానికి స్టిక్కర్‌ను అంటిస్తున్న సిబ్బంది


చందానగర్ డివిజన్ పరిధిలో.. ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజుల, ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి

ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

చందానగర్: దేశ చరిత్రలో తొలిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన చేపట్టిందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం చందానగర్ డివిజన్ పరిధిలోని రెడ్డికాలనీలో స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, ఉపకమిషనర్ మోహన్‌రెడ్డిలతో కలిసి ఆయన సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన ద్వారా బలహీన వర్గాల జాబితాను సిద్ధం చేసి అందరికి అభివృద్ధి ఫలాలు అందేలా చూస్తారన్నారు. ఈ సర్వేను చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఉషారాణి, కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, ప్రసాద్, అక్బర్ ఖాన్, ఎల్లమ్మయ్య, బాలకృష్ణ చౌదరి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.


సర్వేలో అధికారులకు వివరాలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, అధికారులు

శేరిలింగంపల్లి సర్కిల్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా జీహెచ్ఎంసీ అధికారులు ప్రముఖుల నివాసాలకు వెళ్లి వారి ఇళ్లకు స్టిక్కర్లను అంటించారు. అలాగే రోలింగ్ హిల్స్‌లోని ఎమ్మెల్సీ భానుప్రసాదరావు, ప్రశాంత్‌హిల్స్‌లోని ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావుల నివాసాలకు జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డిలు వెళ్ళి సర్వే వివరాలను తెలిపి స్టిక్కర్లను అంటించారు.

ఆల్విన్‌కాలనీలో..

ఆల్విన్‌కాలనీ: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఎమ్మెల్యే గాంధీ నివాసానికి డీసీ కృష్ణయ్య, జీహెచ్‌యంసీ అధికారులు వచ్చి స్టిక్కర్ అంటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశచరిత్రలో తొలిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమగ్ర కుల గణన చేపట్టడం జరిగిందన్నారు. అధికారులు ఖచ్చితత్వంతో కూడిన సర్వే నిర్వహించాలని, ఎక్కడా ఏ పొరపాటు లేకుండా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజలు కూడా సిబ్బందికి సహకరించాలన్నారు.

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక పటాన్‌చెరు


చెరుకును అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా పటాన్‌చెరు నియోజకవర్గం నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఉత్తర భారతీయులు ప్రతి ఏటా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఛట్ పూజను పురస్కరించుకొని బుధవారం తన నివాసంలో పటాన్‌చెరు, ఇస్నాపూర్, పాశమైలారం, బొల్లారం, రామచంద్రాపురం, అమీన్‌పూర్, గుమ్మడిదల ప్రాంతాలలో నివసిస్తున్న ఉత్తర భారతీయులకు చెరుకును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...డివిజన్ పరిధిలో నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరి సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో సైతం తగు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంత.. పట్టించుకోండి


రోడ్డుపై గుంత వద్ద అడ్డంగా పెట్టిన బారికేడ్

మియాపూర్: రహదారిపై మధ్యలో గుంత ఉందని అటువైపు వాహనదారులు రాకుండా ఏర్పాటు చేసిన బారికేడ్ ఇబ్బందికరంగా మారింది. మియాపూర్- మదీనాగూడ జాతీయ రహదారి మధ్యలో గుంతలు ప్రమాదకరంగా మారాయి. రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడడంతో వాహనదారులు రాకపోకలు సాగించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. గత నెల రోజులుగా గుంతలు ఏర్పడినా పట్టించుకునే వారు కరువయ్యారు. ట్రాఫిక్ పోలీసులు గుంత ఉన్నచోట బారికేడ్ ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు వెంబడి అధికారులు ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తుంటారని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్ఓ, డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో ఓటరు జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. శేరిలింగంపల్లి ఈఆర్ఓ, డిప్యూటీ కమిషనర్ ముకుంద్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 9,10 తేదీల్లో పోలింగ్‌స్టేషన్ కేంద్రాల్లో జాబితాలతో బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని, జాబితాలను పరిశీలించి ఏమైనా తప్పులు ఉంటే సవరణకు, అడ్రస్ మార్పు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చే సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రేమ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ అవినాష్‌రాయ్, నాయకులు మిద్దెల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

నిజాంపేట్: బలహీన వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ 12వ డివిజన్‌లో కమిషనర్ సాబేర్‌అలీతో కలిసి ఆమె కులగణన సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, విద్య, రాజకీయపరంగా సముచిత స్థానం కల్పించేందుకు కులగణన కార్యక్రమాన్ని చేపట్టిందని, ఇందుకు ప్రజలు సహకరించి వివరాలు వెల్లడించాలన్నారు. స్థానిక కార్పొరేటర్లు, ఆయా విభాగాల అధికారులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం.. సమగ్ర సర్వే

- మంత్రి కొండా సురేఖ
- సర్వేతో బీసీలకు సామాజిక న్యాయం
- అట్టహాసంగా చిట్కుల్ గ్రామంలో ప్రారంభమైన సర్వే

పటాన్‌చెరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే-బీసీ కులగణన దేశానికే ఆదర్శమని మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో బుధవారం మొదలైన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్‌తో కలసి మంత్రి ప్రారంభించారు. ముందుగా చిట్కుల్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి, బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ...ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టుకునేలా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సర్వేతో కులాల వారీగా బీసీ, ఎస్సీ,ఎస్టీ మైనారిటీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత పెరుగుతుందని వివరించారు. బీసీలకు రిజర్వేషన్లను పెంచేందుకు, రాజకీయంగా అవకాశాలు పెరిగేందుకు ఈ కులగణన ఉపయోగపడుతుందన్నారు.


మంత్రి కొండా సురేఖకు బోనాలతో స్వాగతం పలికిన నాయకులు

1931 తర్వాత మళ్లీ ఇప్పుడే...

బ్రిటిష్ కాలంలో 1931వ సంవత్సరంలో జరిగిన కులగణన తర్వాత దేశంలో మళ్లీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇంటింటి సమగ్ర సర్వే చేపట్టామని వివరించారు. ఈ సర్వేకోసం రాష్ట్రవ్యాప్తంగా 85 వేలకుమంది పైగా ఎన్యూమరేటర్లను నియమించామని ఒక్కొక్క ఎన్యూమరేటర్ 150 కుటుంబాలకు సంబంధించిన వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఒక్కొక్క కుటుంబ సర్వే పూర్తి చేయడానికి అరగంటకు పైగా సమయం పడుతుందని తెలిపారు. ప్రజలు ఎన్యూమరేటర్లకు పూర్తిగా సహకరించి తమ సమగ్ర వివరాలను అందించాలని కోరారు. మన కుటుంబాల ఆర్థిక స్థితిగతుల వివరాల్ని ప్రభుత్వానికి అందజేసేందుకు కష్టపడుతున్న సిబ్బందికి కాంగ్రెస్ కార్యకర్తలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ...సమగ్ర ఇంటింటి సర్వేతో బీసీ కులాల లెక్క తేలుతుందన్నారు. ఈ సర్వేతో ప్రజల ఆర్థిక స్థితిగతులపై అంచనాకు వచ్చి సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించడానికి వీలు పడుతుందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ,మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీపీఓ శ్రీధర్ రావు,పటాన్‌చెరు తహసీల్దార్ రంగారావు, ఎంపీడీవో యాదగిరి,ఎంపీఓ హరిశంకర్ గౌడ్, చిట్కుల్ ఈఓ కవితతో పాటు జిల్లా, మండల అధికారులు,కాంగ్రెస్ పార్టీ వివిధ మండల, బ్లాక్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

మాదాపూర్: అతి వేగంగా వచ్చిన కారు డివైడర్‌ను ఢీ కొన్న సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున 5.40 నిమిషాలకు డ్రైవర్ నరసింహ బొలేరో వాహనంతో హైటెక్‌సిటీ నుంచి జూబ్లీహిల్స్ వైపునకు వెళుతూ మెట్రో పిల్లర్ నంబర్ సీ1719, సీ 1720 మధ్యలో డివైడర్‌ను బలంగా ఢీకొనడంతో డివైడర్ గోడ, కేబుల్స్ ధ్వంసం అయ్యాయి. అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లనే ప్రమాదం జరిగిందన్నారు. కాగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. లీడ్‌స్పేస్ అడ్వర్‌టైజ్‌మెంట్ కంపెనీ సూపర్‌వైజర్ పి.సాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెంచుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొ.యాదగిరి

అధ్యాపకులకు విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి సూచన

పటాన్‌చెరు టౌన్: సైబర్ సెక్యూరిటీపై అధ్యాపకులు అవగాహన పెంచుకోవాలని కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి సూచించారు. పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ అవేర్నెస్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డాటా అనలిటిక్స్ అంశాలపై అధ్యాపకులకు రెండు రోజులపాటు జరుగనున్న రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో బుధవారం యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అధ్యాపకులు శిక్షణ అనంతరం సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెంచుకోవాలన్నారు. అధ్యాపకులకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ శిక్షణ శిబిరం ద్వారా అధ్యాపకులు పొందిన అవగాహనను, నైపుణ్యాలను విద్యార్థులకు అందించాలన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ ప్రవీణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, తారా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రత్న ప్రసాద్, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణబాయ్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ యోగిబాబు, డాక్టర్ పూనమ్ కుమారి, డాక్టర్ సురేశ్ పాల్గొన్నారు.

4,620 ఇళ్లకు స్టిక్కర్లు: డీసీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో బుధవారం కులగణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదు డివిజన్లలో ఇంటింటికి తిరుగుతూ స్టిక్కర్లను వేసి ఆధారాలను సేకరించారు. సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో మొత్తం 4,620 ఇండ్లకు స్టిక్కర్లను వేసినట్లు రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

నిజాంపేట్: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్‌కుమార్ అన్నారు. బుధవారం ప్రగతినగర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌కు ట్రస్ట్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లికి చెందిన అభయాష్ ఎడ్యూటెక్ సౌజన్యంతో కథల పుస్తకాలు, కరెంట్ ఎఫైర్స్ తదితర పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలని, మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించి పుస్తక మేథోసంపత్తిని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పధానోపాధ్యాయుడు చెన్నయ్య అభయాస్ ఎడ్యుటెక్ బ్రాంచ్ మేనేజర్ ప్రబీను, అనిల్, జన విజ్ఞానవేదిక సభ్యులు మల్లయ్య చారి, శంకర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.